# లగ్గం సంబురం

"మన శేటు బిడ్డెకు కరయిందట"

"ఏ ఊరుకో?"

"కోరుట్లకు"

"పిల్లగాడేం జేస్తడు?"

"ఇంకేం లేదట, గని బి.ఏ., నేర్సి టీచర్ ట్రేనింగ్ పాసయిండట. పని కొరకు అర్జిలు పెట్టిండట"

"అంతాయే పనికేం, ఇయ్యాల్ల గాకుంటే రేపు దొర్కుతది. నేర్చిన పిల్లగాడు గదా"

"ఏమైతేం, సదుకున్న పిల్లగాడు దొర్కిండు శేటుకు"

"పిల్ల ఏం తక్క జదిందా? మేట్రిక్ పాసాయె"

ఇలా సాగుతోంది అమ్మలక్కల మధ్య సంభాషణ. వారంతా బీడీల లక్ష్మయ్య కమీషన్ ఏజెంట్ దగ్గర బీడీలు చేసేవారు.

బీడీల లక్ష్మయ్యకు ఆ ఊర్లోనే కాదు. చుట్టుపక్కల గ్రామాలలో కూడా చాలా పేరుంది. ఆ వైపు ఏ సాంఘిక కార్యక్రమానికైనా, పంచాయితీ జరిగినా బీడీల లక్ష్మయ్యకు కబురంపాల్సిందే!

తన కుల విద్య మగ్గం నేయడానికి స్వస్తి చెప్పి బీడీ కమీషను ఏజెంటుగా స్థిరపడిపోయాడు, లక్ష్మయ్య. అతనే కాదు, అతని లాంటి ఎందరో పద్మశాలీయులకు ఇప్పుడు బీడీలు చేయడం, చేయించడం అంటే కమీషను దారుగా ఉండటం, మరో కులవిద్య అయింది. చేతిమీద నేసిన బట్టలు ఎవరు కడుతున్నారు కనుక! మిల్లు బట్ట మేలు రకంగా ఉండటమే కాక చౌక కూడానూ!

పొలం పనులు లేనప్పుడే కాదు, మామూలుగా కూడా గ్రామాల్లో ప్రజలు బీడీలు చేయడం కద్దు.

మొత్తం మీద వ్యవసాయం తర్వాత, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలలోని అధిక శాతం ప్రజలకు జీవిక కల్పించే కుటీర పరిశ్రమ, బీడీల పరిశ్రమ. పదేళ్ళు నిండిన చిన్న పిల్లల నుంచి, ఎనభైలలో పడిన వృద్ధుల దాకా రోజుకు అయిదు వందల నుండి రెండు వేల వరకూ బీడీలు చేస్తారు.

బీడీ కమీషన్ ఏజెంటు అంటే బీడీలు చేయించేవారన్న మాట. పెద్ద పెద్ద బీడీల కంపెనీల ఆఫీసులు జిల్లా కేంద్రాలలో ఉంటాయి. మండలానికి ఒకటి రెండు డిపోలు ఉంటాయి. అవి జిల్లా కేంద్రం ఆఫీసు అధీనంలో పని చేస్తాయి. ఒక్కో డిపో కింద దాదాపు నలభై, యాభై మంది కమీషన్ ఏజెంట్లు ఉంటారు.

వారు డిపో నుండి పొగాకు, తునికాకు(బీడీలు చుట్టే ఆకు) తెచ్చి, బీడీలు చుట్టే కార్మికులకు ఇవ్వడం, వారు తయారు చేసిన బీడీలు పొడవు, నిడివి, బరువులో, కంపెనీ సూచించిన మేరకు ఉన్నాయో లేదో తనిఖీ చేసి, వాటిని డిపోకు పంపడం, బీడీ కమీషన్ ఏజెంటు బాధ్యత. దానికి వేయికింతని కమీషన్ ఉంటుంది. బీడీలు చేసే వారిక్కూడా వేయి బీడీలకు అరవై ఆరు నుండి ముప్పై రూపాయల వరకు కూలీ ఇస్తారు.

ఇప్పుడు బీడీల లక్ష్మయ్యగా చెలామణి అయ్యే వంగ లక్ష్మయ్య దాదాపు ఇరవై సంవత్సరాల నుండి బీడీ కమీషన్ ఏజెంటుగా పని చేస్తున్నాడు. తన ఊరైన "తొర్డి" గ్రామంలోనే గాక పక్క ఊరైన "యేర్గట్ల"లో కూడా అతనికి బ్రాంచి ఉంది. అది లక్ష్మయ్య పెద్ద అబ్బాయి, సురేష్ చూసుకుంటాడు. వారి డిపో కమ్మరిపల్లిలో ఉంది. కంపెనీ ఆఫీసు నిజామాబాదులో ఉంది.

లక్ష్మయ్య ఆధ్వర్యంలో రెండు బ్రాంచిలు కలసి దాదాపు లక్షన్నర బీడీలు రోజూ తయారు చేస్తాయి. అతని ఏకైక కూతురు హైమవతి పెళ్ళి గురించే మాట్లాడుకుంటున్నారు ఆ "కార్ఖానా"లోని బీడీ కార్మికులు.

"లగ్గమెప్పుడు పెట్టుకుంటరో" అడిగింది సాయమ్మ.

"కార్తిక పున్నమైనంక మూర్తాలున్నాయట గదా" బదులు చెప్పింది పెళ్ళి మాటల్లో పాల్గొన్న నర్సవ్వ.

"అయితే ఇంక నెల పందివ్ సాల్ (నెల పదిహేను రోజులు) వున్నై. కట్నమెంతనో?"

"ఇరవై వేలు, ఉండావను (వరకట్నం), గడేరం, పంక, తుల ముంగరం పిల్లగాడికి, అత్తులం కమ్మలు, మూడు తులాల శెవులారు పిల్లకు. దీలే(దీపావళి)కు లూనా కొనియ్యాలట."

"లగ్గం కర్సుతోని డెబ్బై వేలకు దాటుతది. పిల్లకు ఆల్లేం పెడుతున్నారో?"

"మూడు తులాల పెత్తెల తాడు, రెండున్నర తులాల పాట్కీలు (గాజులు)"

"ఒక్కటే బిడ్డ అని గార్వంగా పెంచిండు. మేట్రిక్ దాకా సదుజెప్పించే. మిషను కుట్టుడు గూడా నేర్పించే. దేవుని పుణ్యాన పిల్లగాడికి సర్కారీ నౌకరీ దొరికేంటే ఇక అల్లరుండది."

"బిడ్డె మంచి ఇంట్లో పడితే తల్లిదండ్రులకు ఇంకేం గావాలె?"

అవును. రాజయినా, పేదయినా తన కూతురు కొరకు కోరుకునేది మంచి కాపురమే గదా!

పెళ్ళి ముహూర్తం నిశ్చయమయింది. కన్యాదాత ఊర్లోనే పెళ్ళి. పెండ్లి పత్రికలు అచ్చయ్యాయి. ఊర్లోనే గాక, దూరపు ఊళ్లలో ఉన్న బంధువులకు, స్నేహితులకు ఆహ్వానాలు వెళ్ళినాయి. ఇద్దరబ్బాయిల తర్వాత కలిగిన ఒక్కగానొక్క కూతురు పెళ్ళి కాస్త ఘనంగానే చేయాలని లక్ష్మయ్య సంకల్పం. తాను కూడబెట్టిన సొమ్ముగాక, కొంత అప్పు కూడా చేయడానికి వెనుకాడలేదతను.

హైమ పెళ్ళి తన పరపతికి అనుగుణంగా నలుగురికి కొంతకాలం పాటు జ్ఞాపకం ఉండేలా చేయాలని అతని కోరిక. ఆ కోరికకు అనుగుణంగానే పెళ్ళి ఏర్పాట్లు మొదలు పెట్టాడు.

దగ్గర ఊర్లోని బ్యాండు మేళం, వీడియో, ఫోటోగ్రాఫరు ఏర్పాటు చేశాడు. పెళ్ళి పందిరి అలంకరణకు, కుర్చీలకు, షామియానాలకు, టెంటు హౌజు వారికి ఆర్డరిచ్చాడు. వంట బ్రాహ్మణులను కుదిర్చాడు. కోరుట్లకు పోవడానికి రెండు టూరిస్టు బస్సులకు అడ్వాన్సిచ్చాడు. అతనిద్దరబ్బాయిలే కాక వారి స్నేహితులు కూడా పెళ్ళి పనుల్లో మునిగిపోయారు. ఇంకేం, ఎదురు చూసిన రోజు రానేవచ్చింది.

మర్నాడు ఉదయం పది గంటలకే పెళ్ళి. ఆనవాయితీ ప్రకారం వరుణ్ణి తీసుకురావడానికి జీపు పంపాలి. సాయంత్రం ఆరు గంటలకు అయిదుగురు ఆడ పెళ్ళి వారు పెరుగన్నం, కూరగాయలు తీసికొని, జీపులో కోరుట్లకు బయలుదేరారు. పెళ్ళి కుమారుడు ఆ రాత్రికి వస్తే, మిగతా వారు మర్నాడు అంటే పెళ్ళిరోజునాడు పొద్దున ఏడు గంటల వరకు వస్తారు.

కోరుట్లకు వెళ్ళిన జీపు వరుణ్ణి తీసుకొని తిరిగి వచ్చేసరికి రాత్రి పదకొండున్నర యింది. వారిని మగ పెళ్ళి వారికి కేటాయించిన "గంగపుత్ర సంఘం"లో ఉంచి, టీ ఫలహారాలతో సత్కరించారు.

"ఏం సురేశా, బాగా ఆలిసెం అయింది?" అడిగాడు నర్సయ్య

"ఆలిసెం గాకుంటే ఏమైతది కాకా! మేం బోయేటప్పటికి ఇంకా ఏం తయారు కాలేదు. మేమత్తమని గుర్తే గదా! వంటన్న చేసి పెట్టద్దా! మేం జేరినంక వంటకు పెట్టిన్రు ఆగమాగం అడ్డిచ్చిండ్రు. బువ్వకచ్చపక్క, పప్పు కారం, కూరల ఉప్పెక్క, అదేందో నాకైతె ఆల్ల లక్షణం మంచిగనిపియ్యలే. "సురేష్" ఆల్లకు తోయకుండవచ్చు ఆల్లింట్ల పైల

(మొదటి) లగ్గం గదా!" నర్సయ్య.

ఇదంతా విన్న లక్ష్మయ్యకు మాత్రం ఎక్కడో అపశ్రుతిగా తోచింది. తాము వరుని ఇల్లు చూడడానికి పోయినప్పుడు, మగపెళ్ళి వారి దర్పం కాస్త అతిగానే అనిపించింది. అయినా సర్దుకుపోయాడు. ఇప్పుడీ కథనం! ఎలాగో ఈ కాస్త తలపెట్టిన కార్యం నిర్విఘ్నంగా జరిగితే అదే పదివేలు" అని తన దైవాన్ని స్మరించాడు.

పెళ్లి రోజు... ఉదయం ఎనిమిది గంటలు కావస్తుంది. ఏడు గంటలకు వస్తామన్న మగపెళ్ళి వారు ఇంకా రాలేదు.

లక్ష్మయ్య హడివుడిగా ఇంట్లోకి, బయటకు తిరుగుతున్నాడు.

"యేడేంగ అత్తమనిరి, ఎనిమిదాయే, ఇంకా పత్తకు లేరు. పదేంగ లగ్గం. పైడు ముడుపు జేయాల, పిల్లగాన్ని ఎదర్కోవాల, పదికి మూర్తమాయే. ఫోను జేద్దమంటే అన్నలు ఎక్సేంజీ కాలపెట్టిరి. ఇగ ఎట్ల! ఏం కత?" అడిగాడు లింగయ్య లక్ష్మయ్యను.

"దూరం మాటాయే, బస్సు కుశయిందో లేక ఆల్లకు పిల్లుడికే ఆలిసెం అయిందో. ఇంక తోడెం సేపు జూద్దాం" అన్నాడు లక్ష్మయ్య, కులం పెద్ద మనిషి లింగయ్యతో.

"ఎనిమిదిన్నర దాక జూసి, పిల్లగాన్ని హన్మాండ్ల కాడికి తీస్కపోదాం. పిల్లగాడోల్లు రాంగనే పైడు ముడుపు జేశెయ్యచ్చు" అందుకున్నాడు గజం నర్సయ్య - వధువు మేనమామ.

ఎనిమిదన్నర... పావు తక్కువ తొమ్మిది. మగపెళ్ళివారి జాడలేదు.

పెళ్ళి పందిట్లో హడావుడి మొదలైంది. వరున్ని హనుమంతుని మందిరానికి తీసుకుపోవడానికి సన్నాహాలు చేయసాగారు.

అయిదుగురు ముత్తైదువలు మంగళహారతులు పట్టుకుని రెడీగా వున్నారు. ఇద్దరు డప్పుల వాళ్ళ కొరకు పోయారు. ఎంత బ్యాండు మేళం వున్నా, మాదిగ డప్పులు ఉండాల్సిందే!

"ముత్తెమ్మా, నువు పిలగానికి బాశింగాలు గట్టు, కమలా మీరు మంగళారతులు ముట్టిచ్చి తయారుగా ఉండుండ్రి. డప్పులోల్లు రాంగనే ఎల్లి ఐనారు (పెళ్ళి కుండలు) ఎదుర్కద్దాం." నర్సవ్వ చురుకుగా తిరుగుతూ సన్నాహాలు చేయసాగింది. ఐనార్లు ఎదుర్కొని వరున్ని హనుమాన్ మందిరానికి తీసికెళ్లే వరకు తొమ్మిది గంటల పది నిమిషాలయింది.

అప్పుడే! మగ పెళ్ళి వారి బస్సులు వచ్చాయని కబురందింది.

వందా యాభై కంటె ఎక్కువ రామని చెప్పిన వారు, మూడు బస్సుల్లో పిల్లా, జెల్లా కలిసి మూడు వందల మంది దాకా వచ్చారు. లక్ష్మయ్యకు, మిగతా ఆడపెళ్ళివారికది నచ్చలేదు. కొందరు బాహాటంగానే మగపెళ్లివారిని తప్పుబట్టారు. లక్ష్మయ్య వారిని శాంతింపజేసి, ఎక్కువగా వచ్చిన అతిథులకు సరిపడే వంటలు చేయటానికి, బ్రాహ్మలకు పురమాయించాడు. ఆ తర్వాత వచ్చిన అతిథులను వారి విడిదికి తీసుకెళ్ళారు. వరి

పేలాలు, శనగలు, వేరుశనగలు కలిపి తాలింపు వేసిన ఫలహారం తయారుగా వుంది, మగపెళ్ళివారికి. వారు రాగానే టీ, ఫలహారం ఇవ్వడం ఆనవాయితీ. పెళ్లి మర్యాదలలో అది ఒక నిబంధన కూడా! ఎక్కువ వచ్చిన అతిథులకు సరిపడా టీ, ఫలహారాలు చేయబడ్డాయి.

"కొందరు చాయి, ఫలారాల కాడ వుండుండ్రి, మేం పోయి పైడు ముడుపు శేత్తం, మూర్తంకు పోని గంట కూడ లేదు" అని లక్ష్మయ్య హడావుడిగా హనుమంతుని గుడి దగ్గరకు బయలుదేరాడు. అప్పటికే కులం పెద్దలు పైడు ముడుపు ఏర్పాటు చేశారు.

మగపెళ్ళి వారు - ఆడపెళ్లి వారు చిన్న చిన్న గులక రాళ్ళతో కొట్టుకున్నారు. అబద్ధపు పోట్లాట నటించారు. ఆ తర్వాత ఒకరి నోట్లో ఇంకొకరు పంచదార, బిస్కట్లు, పోసుకుని కలసి పోయారు. పైడు ముడుపు (ప్రధానం) తంతు ముగిసింది.

ఆపైన వరుణ్ణి కూర్చుండబెట్టి బ్యాండు మేళంతో కళ్యాణవేదికకు తీసుకువచ్చారు. అన్నంతో దిష్టితీసి పెళ్ళి పీటలపై కూర్చోబెట్టారు. పురోహితుడు మంత్రాలు చదువుతూ సూచనలిస్తున్నాడు. ఇద్దరు వరునికి అడ్డంగా తెల్లదుప్పటి పట్టుకున్నారు. ఆ తర్వాత పెళ్ళికూతురిని తీసుకువచ్చి పెళ్ళి పీటల మీద కూర్చోబెట్టారు. లక్ష్మయ్య దంపతులు వరుని కాళ్ళు కడిగి కన్యాదానం చేశారు. వధువు కాళ్ళు కూడా కడిగారు.

హడావుడి నైతేనేం, పది గంటల పది నిమిషాలకు అక్షింతలు పడ్డాయి. అలా అయిదుసార్లు జరిగాక, మంగళసూత్రధారణ, సప్తపది కూడా పూర్తయ్యాయి.

ఇక హోమహవనం మొదలయింది. నిజానికి పెళ్ళికి ముందే హోమం చేయాలి. కాని మగపెళ్ళి వారు రావడంలో ఆలస్యం చేయడం వల్ల, పెళ్ళి తర్వాత హోమం చేయాల్సి వచ్చింది. ఇలాంటివి పెళ్ళిళ్ళలో మామూలే. వరునితో, వధువుతో ఎన్నో ప్రమాణాలు చేయిస్తున్నాడు పురోహితుడు. ఆయన చెప్పినట్టల్లా చేస్తున్నారు వారు. ఆ ప్రమాణాలు వారి తలకెక్కాయా? అవి వారు జీవితాంతం పాటిస్తారా? అంటే సందేహమే మరి!

ఏదో "విధి"గా ప్రమాణాలు చేయడమే కాని వాటిని అర్థం చేసుకునేదెంత మంది? అర్థం చేసుకుని ఆజన్మాంతం గుర్తు పెట్టుకుని ఆచరించేదెంతమంది? ఎలానైతేనేం, వరుడు సుభాష్ - వధువు హైమవతి భార్యా భర్తలయ్యారు. ఇక పెళ్ళి ముచ్చట్లు ప్రారంభం అయ్యాయి.

అటు పెళ్ళి భోజనాలు మొదలయ్యాయి. ఇటు వధూవరుల్ని కన్యాదాత ఇంటికి తీసికెళ్ళారు. ఒకరి పేరు ఇంకొకరు - అదీ పొడుపు కథలో చెప్పందే లోనికి రానివ్వలేదు. వరుని ఉత్తరీయానికి, వధువు చీర చెంగుకు కట్టిన ముడి విప్పబడలేదు.

నవదంపతులు ఒకే కంచంలో ఒకరికొకరు తినిపిస్తూ భోంచేశారు. వరసైన వారు వేళాకోలం చేయడం, వధూవరులు బెట్టు చేయడం, ఇలా వేడుకగా మొత్తం మీద చాలా బాగా జరిగింది పెళ్ళి.

కాస్త భుక్తాయాసం తీరిన తర్వాత తన అత్తగారి ముంత తీసుకుని, అలిగి హనుమంతుని గుడి వద్దకు వెళ్ళాడు సుభాష్. అతనిపై దొంగతనం నెపం వేశారు ఆడపెళ్ళి వారు. దానికి మగపెళ్ళివారు కయ్యానికి దిగారు.

ఇంటికి తిరిగి రమ్మని వరుణ్ణి బ్రతిమాలారు లక్ష్మయ్య దంపతులు. అదనంగా ఒక టేపు రికార్డరు కావాలని పేచీ పెట్టాడు సుభాష్. ఇక ఔననక తప్పలేదు వధువు తండ్రికి, ఇదంతా పెళ్ళి ముచ్చట్లలోని భాగమనే. పెళ్లిలో వరుడు 'అలిగి' కట్నం కోరడం, అది ఆడపెళ్లివారు తీర్చడం ఆనవాయితీ. ఇక ఆడపెళ్ళివారి వంతు వచ్చింది. ఎప్పుడూ, అంటే పెళ్ళి రోజంతా వరుని దగ్గర ఉండాల్సిన కత్తెర ఎవరో దాచిపెట్టారు. బావమర్దుల కట్నం - కనీసం వేయి రూపాయలు జరిమానాగా ఇస్తేనే కత్తెర తిరిగిస్తామని షరతు. ఇరవై రూపాయల కత్తెర పోతే పోయింది, ఇంకోటి కొనుక్కుంటానని పెళ్లి కుమారుని ధీమా! తమ కట్నం ఇవ్వందే కదలనివ్వమని బావమర్దుల సవాల్!

నాదేం పోయింది, ఇక్కడనే ఉంటానని వరుని జవాబు.

అలా కాస్త బెట్టు చేసిన తర్వాత, చివరకు రెండు వందల రూపాయలు ఇచ్చాడు సుభాష్. నగదు, వస్తు రూపంలో యాభై వేల వరకు దండుకున్న పెళ్ళికొడుకు, ముష్టి రెండు వందలు ఇవ్వడమేమిటని, బావమరుదులు కోప్పడ్డారు. అవి కూడా అతన్నే ఉంచుకోమని అన్నారు. పెద్దలు చెప్పిన తర్వాత ఊరుకున్నారు. ఈ విషయంలో సుభాష్ ప్రవర్తన వారికి నచ్చలేదు.

ఇక నాగవెల్లి కార్యక్రమం మొదలయింది. ఒకరింట్లో మగ పెళ్ళివారు, తాము తెచ్చిన బియ్యం (దాదాపు 10 కిలోలు), అయిదు రవిక గుడ్డలు, అయిదు ఎండు కుడుకలు, ఒక పళ్ళెంలో పెడతారు. ఇంకో ఇంట్లో ఆడపెళ్ళివారు అలానే చేస్తారు.

వధూవరులు, నాగవెల్లి బట్టలు వేసుకుని ఒడి బియ్యం మలుస్తారు.

వరుడు తమ బియ్యం ఆడపెళ్ళి వారికి మలుస్తాడు. వధువు తమ బియ్యం మగపెళ్లి వారికి మలుస్తుంది. అయిదు సార్లు ఒక ఇంటి నుంచి ఇంకో ఇంటికి తిరిగి ఒడి బియ్యం మలచడం పూర్తి చేస్తారు. ఆఖరున మొత్తం బియ్యం కలిసిపోయి ఒకరి బియ్యం ఇంకొకరికి చెందుతాయి.

ఆ బియ్యం పెళ్ళి తర్వాత జరిగే వియ్యంపురాళ్ల వాయినం - విందులో వండి భోజనం పెడతారు. ఈ తంతు ఒకరింట్లో, ఇంకొకరు కలిసిపోవడానికి సంకేతం.

నాగవెల్లి కాగానే కొందరు మగపెళ్ళివారు పగటి భోజనాలు కూడా కానిచ్చారు. లక్ష్మయ్య, ముందుచూపుతో, సత్వరంగా చేయించిన ఏర్పాట్ల వల్ల వంటలు సరిపోయాయి. కాస్త మిగిలాయి కూడాను. గడుసుతనంతో, చెప్పిన దానికంటే ఎక్కువ సంఖ్యలోనే, మగపెళ్ళివారు వచ్చిపడినా, లక్ష్మయ్య నేర్పరితనంతో అతని పరువు దక్కింది.

ఇక మరుసటి రోజు వరుని ఇంట్లోని విందు సంగతి చర్చకు వచ్చింది. దాదాపు

యాబై మంది వస్తామని హైమ తండ్రి అన్నాడు. మరునాడు పొద్దున పదకొండు గంటల వరకు భోజనాలయితే, తాము పగలు రెండు మూడు గంటల వరకు తిరిగి రావచ్చని అతని ఉద్దేశం. ఉదయం విందు కుదరదన్నారు మగపెళ్ళివారు. రాత్రి, తమ ఊర్లోని స్నేహితులకు మాంసం భోజనాలు ఒప్పుకున్నామనీ, వారితో పాటే వీరికీ భోజనాలు ఏర్పాటు చేస్తామని వారి వాదన.

ఆ రోజు తమ ఊరు చేరే సరికే రాత్రి పది పదకొండవచ్చు. ఆ తర్వాత ఉదయం భోజనాలకు సన్నాహాలు చేయడం కుదరదు కనుక ప్రొద్దున భోజనాలు ససేమిరా పెట్టలేమని నొక్కి చెప్పారు. దీనిపై చాలా రాద్ధాంతం జరిగాక ప్రొద్దున శాఖాహార భోజనాలకు ఒప్పుకున్నారు.

ఇక్కడ లక్ష్మయ్య మనసు మళ్ళీ చివుక్కుమంది. ఉల్లాసంగా, సంబరంగా జరగాల్సిన పెళ్ళి ముచ్చట్లు, తగువులతో ముగుస్తున్నాయి. మరుసటి రోజు ఎలా గడుస్తుందో!

ఇక అప్పగింతకు సన్నాహాలు ప్రారంభం అయ్యాయి.

వధూవరులను బ్యాండు మేళం ఊరేగింపుతో గుడికి బయలు దేరదీశారు. వెనక పెళ్ళి కానుకల ట్రాక్టర్ వుంది. హైమవతికి తన తల్లిదండ్రులు ఏమేమి కట్న - కానుకలు ఇచ్చారోనని కుతూహలంగా చూస్తున్నారు ఊళ్ళోని జనం.

డెకోలం మంచం, పరుపులు, స్టీలు బీరువా, పంఖా, గంగాళం, కొప్పెర, స్టీలు నీళ్ళ టాంక్, కుక్కర్, మిక్సర్, ఎన్నో వంట పాత్రలు మొదలైనవి అన్నీ ఒక ట్రాక్టర్లో పొందికగా పేర్చబడి వున్నాయి. గ్రామప్రజలు, తెలిసిన వారు, తెలియని వారు, పిల్లలు, పెద్దలు ఊరేగింపుతో నడుస్తున్నారు. ఆ దృశ్యం కనులకింపుగా వుంది.

గుడిలో పూజ చేసిన తర్వాత, అప్పగింతల కార్యక్రమం మొదలయింది. సాధారణంగా ఇంటికి తిరిగి వచ్చి అప్పగింతలు చేయాలి. కానీ చీకటి పడుతున్నందున గుడి నుంచే అప్పగించాలని నిర్ణయించారు. అయిదు రోజుల వేడుకగా జరిగే పెళ్ళి ఒక్క రోజులోనే పూర్తి చేయాలి మరి!

లక్ష్మయ్య దంపతులు వధువు చేతిని వరుని తల్లిదండ్రుల చేతుల్లో పెట్టి కాళ్ళకు దండం పెట్టారు. ఆపైన వరుని చేతిలో, వారి దగ్గరి బంధువుల చేతుల్లో హైమవతి చేతిని పెట్టి వాళ్ళ కాళ్లకు నమస్కారం పెట్టారు. ఆ తర్వాత పెళ్ళికూతురి అన్నలు, దగ్గరి బంధువులు వధువును మగపెళ్ళి వారికి అప్పగించారు. తమ బంగారు కొండకు ఏమాత్రం కష్టం కలుగకుండా తల్లిగారిల్లు జ్ఞాపకం రాకుండా చూసుకోమని కోరుకున్నారు. అక్కడ అందరి కళ్ళూ వర్షిస్తున్నాయి. తమ ప్రాణంలోని ప్రాణం పరాయిదయిందని దు:ఖంగా ఉన్నారు. పెళ్ళికూతురు కూడా ధారాపాతంగా ఏడుస్తూనే వుంది. ఆడపెళ్ళివారి ఇంటివారే కాక ఇరుగు పొరుగు వారు కొందరు ప్రేక్షకులు కూడా అశ్రువులను ఆపుకోలేకుండా వున్నారు. మగపెళ్ళివారు మాత్రం ఇదంతా తమకేమీ పట్టనట్టు నిర్వికారంగా ఉన్నారు. జాప్యం జరుగుతోందని ఒకింత అసహనంగా కూడా ఉన్నారు.

అదేమి చిత్రమో కాని ఆడకూతురన్న తర్వాత ఆమెకు పెళ్లి చేయడం తమ బాధ్యత అనీ, ఆ తర్వాత ఆమె పరాయి ఇంటికి పోతుందనీ తెలుసు. పెళ్ళి చేసేది కూడా అందుకే. కానీ ఆ ఘడియ వచ్చేసరికి దు:ఖం ఆగదు. తమ బిడ్డ, ఇంకా తమ ఇంట్లోనే ఉంటే బాగుండును అనిపిస్తుంది.

దాదాపు ఏడు గంటల ప్రాంతంలో మగపెళ్ళివారు వధూవరుల సమేతం, తోడు వధువుతో, తమ బంధుమిత్రులతో కలిసి మూడు టూరిస్టు బస్సులలో కోరుట్లకు బయలు దేరారు.

ఇక్కడ! ఆడపెళ్లి వారి ఇల్లు బోసిగా వుంది. ఎవరి మనసులో వారు దు:ఖపడుతున్నారు. అది సహజమే కదా!

ఆ మర్నాడు దాదాపు వందా యాభైమంది ఆడపెళ్లివారు, రెండు టూరిస్టు బస్సుల్లో కోరుట్ల బయలు దేరారు. వారు అక్కడికి చేరే సరికి దాదాపు పదిన్నరైంది. పిల్లలంతా ఆకలిగా వున్నారు. ఎండకు నోళ్ళెండిపోయాయి.

బస్సు దిగిన పది నిమిషాల తర్వాత ఇద్దరు మగపెళ్ళి వారు వచ్చి వారిని విడిదికి తీసికెళ్ళారు. వరుని కుటుంబ సభ్యులెవరూ రాలేదు. అక్కడున్న నీళ్ళతో కాళ్ళు చేతులు కడుక్కుని, మంచినీళ్లు తాగి, తమ బడలిక తీర్చుకున్నారు.

అయినా వరుని కుటుంబ సభ్యులు పత్తా లేరు. ఇంకా వంటలయినట్లు లేదు. టీ, ఫలహారాలు కూడా లేదు. ఏదో పిలవని పేరంటానికి వచ్చినట్టు అయింది.

దాదాపు అరగంట తర్వాత కొందరు కుల పెద్దలు, వరుని తండ్రి దిగారు. అప్పటికే ఆకలితో కడుపు నకనకలాడిపోతున్న కొందరు యువకులు వారిని నిలదీసారు. మేము రాత్రి భోజనాలు పెడతామంటే మీరు వినలేదని మగపెళ్ళివారూ, ఆ తర్వాత ఒప్పుకుని కూడా మీరు భోజనాల ఏర్పాట్లెందుకు చేయలేదని ఆడపెళ్ళివారూ ఒకరినొకరు దూషించుకున్నారు.

మాటామాటా పెరిగింది. ఇలా అవమానపర్చడానికా మమ్మల్ని ఇక్కడకు తీసుకొచ్చావని కొందరు ఆడపెళ్ళివారు లక్ష్మయ్య మీద విరుచుకుపడ్డారు.

టీ, ఫలహారాలు లేకపోతే మానె పన్నెండు గంటలవుతున్నా, పెడతామని ఒప్పుకున్న భోజనానికి ఏర్పాటు చేయకపోతే ఎలా? మా ఇంట్లో తిండికి లేక ఇక్కడకు వచ్చామా? అని వాపోతూ కొందరు తమ బంధువుల ఇండ్లకు వెళ్ళారు. కొందరు యువకులు హోటళ్ళ వైపుకు దారితీశారు. లక్ష్మయ్య కొడుకులైతే ఏదో హోటల్లో మనమే ఏర్పాటు చేద్దాం అన్నారు.

వారిని శాంతింపచేసి, అలా చేస్తే తప్పుబడతారనీ, ఆ తర్వాత పైమను దెప్పుతారనీ నచ్చచెప్పారు. ఒంటిగంట తర్వాత తీరా భోజనాలు అమరిస్తే, యాభై, అరవై మంది కూడా లేరు. వంటలు కూడా అంతంత మాత్రంగానే వున్నాయి. విరిగిన మనసులతో తిరిగి 'తొర్థి' వచ్చారు లక్ష్మయ్య బృందం.

చాలాకాలం తర్వాత ఆ రాత్రి మద్యం సేవించాడు లక్ష్మయ్య. అతని మనసు వికలంగా వుంది. కళ్ళు వర్షిస్తున్నాయి. తనలో తాను గొణుక్కుంటున్నాడు.

"ఒకే బిడ్డ అని గర్వంతోని పెంచితి. లెంకి, లెంకి (వెదికి, వెదికి) సదూకున్న పిల్లగాడు గదా ఎక్కవుండావను అడిగినా ఒప్పుకుంటి. ఎంత సంబురం తోని లగ్గం జేత్తే, అల్లు గిట్ల జేసిరి. నేను కర్సు కెనక్కొచ్చిన్నా, ఏదన్న గమ్మతుకెనక్కొచ్చిన్నా? నూట యాభై మంది వత్తమని జెప్పి మున్నూరు మందిని దెచ్చినా, అందరికి ఫలహారాలు, భోజనాలు జేపిత్తి. ఇంక ఆల్ల ముఖంకు పగల భోజనాలు గూడా పెడ్తి.

"అదే, మేం బోతే బిచ్చగాల్లకంటే హీనంగా జూసిరి. గిసంటోల్ల దగ్గెర నా హైమ ఎట్ల నెగుల్తదో! నా తల్లికి కష్టాలు పెడతారో! పెద్ద మనసుల కంటే తెలకపాయె. అల్లు సదు నేర్వకపాయిరి. కాని పిల్లగాడు? సుభాష్? బి.ఏ. నేర్సిండట. బి.ఏ.? మంచి, మర్యాద లేకుండే ఏంటికట ఆ సదువు? ఆయనకు గూడా తెలదే, ఆల్లమందికి సముదాయించరాదా?

"మన్నుదిన్న పాములే మూలకు కూర్చుండి నోపతిగాల్లతోని ముచ్చట్లలో ఉండే. ఇగ నా హైమ బతుకెట్లనో ఏమో? అందరికి యాదుండేటట్టు, లగ్గం చేయాలనుకుంటే, గిట్ల యాదుండిపాయె. లగ్గం తొక్కపోయి భోజనం పెట్టిపియ్యకపోయె, అని పేరొచ్చె."

అతని భార్య కూడా ఏడుస్తోంది. కాని తన భావాలకు మాటల రూపం ఇవ్వటం లేదు. కాసేపయిన తర్వాత భర్త దగ్గరికి వెళ్ళి తన చీర కొంగుతో కళ్ళనీళ్ళు తుడిచింది. "ఏం జేద్దం, మన సేతులున్నకాడికి మనం జేసినం. ఇగ పరమాత్ముని దయ. హైమ నసీబు, దాని ఎంబడ (వెంట) పిల్లగాడు బుద్ధిమంతుడే అన్నారు. ఆ టైముల ఆయనకు తోయకుండచ్చు. అంత మంచిగయితది. నువ్వేం ఫికరు సెయ్యకు. ఇంటికి పెద్ద నువ్వే ఇట్ల అయిటీల్తే, మా గతేం గావాల."

లక్ష్మయ్య శాంతించాడు. కాని అతని మనసు మథనపడుతూనే వుంది.

గారాబంగా పెంచిన తన కూతురు జీవితాంతం సుఖపడాలని, వెదికి వెదికి కుదిర్చిన ఈ సంబంధం, హైమపట్ల శాపంగా పరిణమించదు గదా! పెళ్ళిలోని అనుభవాలు ఒక పీడకలగా, మళ్ళీ జీవితంలో ఎప్పుడూ కలగకూడదనీ, తన గారాల పట్టి కలకాలం సుఖంగా ఉండాలనీ, ఆ భగవంతుని ప్రార్థించడం మినహా ఏమీ చేయలేని అసహాయుడుగా మిగిలిపోయాడు లక్ష్మయ్య.

లక్ష్మయ్య లాంటివారు మన దేశంలో ఎందరో! ఎన్నో వ్యయప్రయాసలకోర్చి, ఎంతో వేడుకగా సంబరంగా చేయాలనుకున్న పెళ్ళి సంరంభాలు వాదోపవాదాలతో, గొడవలతో ముగుస్తాయి. ఆ తర్వాత కక్షలకు దారి తీస్తాయి.

అనాదిగా వస్తున్న మగపెళ్ళివారి దర్పం, వారి అహంకారం, ఆడపెళ్ళి వారిని కించపరుస్తూనే వున్నాయి. ఎన్ని స్త్రీవాద సదస్సులు జరిగినా, స్త్రీలకు సమాన హక్కులు అంటూ ఎంత గొంతు చించుకున్నా, మనలో, మన వ్యవస్థలో మార్పు రానంతవరకు ఆడపిల్లలను కన్న నేరానికి లక్ష్మయ్యలకు ఇలాంటి మనస్తాపం తప్పదు. ★